క్లుప్తంగా

నిలబడే ప్రదర్శనల వీక్షణ



విజయవాడ కల్చరల్: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కనకదుర్గానగర్‌లో తొమ్మిది రోజులపాటు నిర్వహించే సాంస్కృతిక ప్రదర్శనల్లో భక్తులు అవస్థలు పడుతున్నారు. కూర్చొని చూసేందుకు కనీసం కుర్చీలు కూడా వేయకపోవడంతో నిలబడే ప్రదర్శనలు వీక్షించాల్సి రావడంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు. కళా వేదిక ఎత్తుగా ఏర్పాటుచేయక పోవడం వల్ల ప్రదర్శనలు వీక్షించే అకాశం లేకుండా పోయింది. గతంలో లిఫ్ట్ మార్గం పక్కనే విశాలమైన వేదిక మీద కార్యక్రమాలు జరిగేవి. ఈ ఏడాది కనకదుర్గానగర్ ఎంట్రన్స్‌లో ఏర్పాటు చేశారు. వేదిక మార్పు గురించి కళాకారులకు తెలియజేయక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయం అక్కడే ఉన్న కార్యనిర్వహణ అధికారి దృష్టికి సాక్షి తీసుకొని వెళ్ళడంతో గురువారంలోగా పూర్తి సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.

బీబీఏ మానవ హక్కుల కమిటీ సభ్యుడిగా రాజు



భవానీపురం(విజయవాడపశ్చిమ): బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) మానవ హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యుడిగా భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీకి చెందిన న్యాయవాది వీఎన్ రాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ గతేడాది బీబీఏ హ్యూమన్ రైట్స్ కమిటీకో కన్వీనర్‌గా పని చేశానని పేర్కొన్నారు. ఈ ఏడాది కమిటీ సభ్యుడిగా రెండో సారి కూడా అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఎక్కడైనా మానవ హక్కుల ఉల్లంఘన జరిగినట్లు తన దృష్టికి వస్తే వెంటనే స్పందించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. తనపై నమ్మకంతో ఈ అవకాశాన్ని కల్పించిన బీబీఏ ప్రెసిడెంట్ కొత్త చంద్రమౌళి, జనరల్ సెక్రటరీ అరిగల శివరామప్రసాద్, కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటాలు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): భారత రాజ్యాంగం ప్రతిపౌరుడికి అందించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంను కాపాడుతూనే కులవ్యవస్థ, కులవివక్షతలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్వహించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి పిలుపునిచ్చారు. కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా బందులదొడ్డి సెంటర్‌లో కేవీపీఎస్ జెండాను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ.. సనాతన ధర్మం గురించి మాట్లాడటం అంటే కులవ్యవస్థను ప్రోత్సహిస్తూ దళితులు, గిరిజనులు, మహిళలకు రక్షణ లేకుండా చేయడమేనన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు అవుతున్నా నేటికి దళితులు, గిరిజనులపై వివక్ష, అంటరానితనం, దాడులు, హత్యలు, అత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పెరియార్, గుర్రం జాషువా, పుచ్చలపల్లి సుందరయ్య వంటి ఎందరో స్ఫూర్తితో వారి ఆశయ సాధనకై కేవీపీఎస్ పని చేస్తోందని చెప్పారు. కేవీపీఎస్ నాయకులు క్రాంతి, శ్రీనివాస్, పి.కిరణ్, విజయ్, దానీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సేవలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాల్లోని వివిధ కళాశాలలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు 726 మంది మొదటి రోజు దసరా ఉత్సవాలలో సేవలు అందించారని ఎన్టీఆర్ జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో క్యూలైన్ల నియంత్రణ, మంచినీటి సరఫరా, దివ్యాంగులకు సేవలు, ట్రాఫిక్ నియంత్రణ, భోజనాలు వితరణలో సహాయం, ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ లో సేవలు అందించినట్లు పేర్కొన్నారు. ఒక్కొక్క బ్యాచ్‌కు 250 మంది చొప్పున మూడు షిఫ్ట్‌ల్లో సేవలందించారని చెప్పారు. పోలీసు బందోబస్తు సేవలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఉత్సాహంగా పని చేశారన్నారు. వలంటీర్లను సైబర్ క్రైమ్ సీఐ జానకి రామయ్య, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ యుగంధర్, వివిధ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు సమన్వయం చేశారని తెలిపారు.

శరణు.. శరణు







ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో గురువారం దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభయ్యాయి. తొలి రోజు శ్రీబాలా త్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని శరణు కోరారు. అమ్మవారికి ఉదయం విశేష పూజలు, అర్చనలు, హోమాలు, సాయంత్రం నగరోత్సవం నిర్వహించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ













ఆలయాల్లో దసరా ఉత్సవాలు ప్రారంభం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నియోజకవర్గ పరిధిలోని ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. చిట్టినగర్‌లోని కొత్త అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరిలు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ప్రముఖులను ఆలయ కమిటీ ప్రతినిధులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేయగా, కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. తొలుత ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కలశ స్థాపన కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యదర్శి పొట్నూరి దుర్గాప్రసాద్(రాజా) దంపతులు పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై పలువురు చిన్నారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. కళాకారులకు దేవస్థానం తరపున అమ్మవారి తీర్థప్రసాదాలను కమిటీ ఉపాధ్యక్షుడు బెవర శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి శీరం వెంకట్రావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పలు ఆలయాల్లో పూజలు...

గంగానమ్మ వారి ఆలయంలో అమ్మవారు శ్రీబాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీదుర్గా గాయత్రి అర్చక యాగ్నిక పురోహిత సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలలో విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పూజలు నిర్వహించగా, ఉమ్మడిశెట్టి వెంకట దుర్గా శివ నాగేంద్ర, నివేదిత, యేదిపాటి వెంకటేశ్వర్లు, అంజలిలు పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాలను కమిటీ గౌరవ అధ్యక్షులు సుంకర వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, కుంచెం శ్రీనివాసరావు, పిళ్లా ఏసుబాబు, మాచర్ల సూర్యతేజలు పర్యవేక్షించారు.



మాజీ మంత్రి వెలంపల్లికి చిత్రపటాన్ని ఇస్తున్న ఆలయ కార్యవర్గం, మేయర్ భాగ్యలక్ష్మి



మహాలక్ష్మీ దేవిగా కొత్త అమ్మవారు







భీమన వారి పేటలో; బాలా త్రిపుర సుందరీదేవిగా గంగానమ్మ ; పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు

భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో అమ్మవారు విజయ దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 7 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాసన, 11 గంటలకు కలశ స్థాపన జరిగాయి. మహిళలచే సామూహిక కుంకుమార్చనలను ఆలయ అర్చకులు చింతలపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మలు జరిపించారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ జరగ్గా, ఉభయ దాతలు, భక్తులు పాల్గొన్నారు.

అమ్మ దర్శనం.. సర్వపాపహరణం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం కోళ్ల ఫారం రోడ్డులో ఏర్పాటు చేసిన దసరా ఉత్సవాల్లో అమ్మవారు శ్రీబాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. శుక్రవారం శ్రీగాయత్రి దేవి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. గొల్లపూడి పంచాయతీ పరిధిలోని ఊర్మిళా సుబ్బారావునగర్ గ్రామ దేవత పోలేరమ్మ దేవస్థానంలో స్వర్ణకవచ అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. శుక్రవారం పోలేరమ్మ శ్రీబాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనమిస్తారని దేవస్థానం కమిటీ అధ్యక్షుడు సూరసాని రామిరెడ్డి తెలిపారు. భవానీపురం ఓల్డ్ హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో నిర్వహించిన దసరా మహోత్సవాల్లో భాగంగా తొలి రోజు శ్రీబాలా త్రిపుర సుందరీ దేవి అమ్మవారికి మహిళా భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

పాతబస్తీలో ప్రారంభమైన ఉత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని కేటీ రోడ్డు, బ్రాహ్మణవీధి తదితర ప్రాంతాలన్ని విద్యుత్ దీపాలతో, అమ్మవారి గీతాలతో, వేద పఠనాలతో ఆధ్యాత్మికతను వాతావరణం వెల్లువిరిచాయి. ఉత్సవాలను పురస్కరించుకొని ఆయా ఆలయాల్లో గురువారం ఉదయం స్నపనాభిషేకాలను నిర్వహించారు. అనంతరం ఆయా ఆలయాల్లో నిర్ణయించిన అలంకారాలను చేసి దర్శనానికి అనుమతించారు. కుంకుమార్చనలను నిర్వహించారు.



సాయిబాబా మందిరంలో..

పలు ఆలయాల్లో..

వన్‌టౌన్ కేటీ రోడ్డులోని శ్రీ గంగానమ్మ వారి దేవస్థానంలో అమ్మవారికి శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవి, బ్రాహ్మణవీధిలోని చదునుమహాలక్ష్మమ్మ దేవస్థానంలో శ్రీ రజిత కవచాలంకృత చదును మహాలక్ష్మి అమ్మవారిగా భక్తులను అలరించారు. శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం (పాతశివాలయం)లో కొలువై ఉన్న శ్రీభ్రమరాంబ అమ్మవారికి ఉదయం నుంచి కుంకుమార్చనలను వైభవంగా నిర్వహించారు. అమ్మవారు రజితకవచాలంకృత భ్రమరాంబదేవిగా దర్శనమిచ్చారు. అలాగే ఉత్సవాల్లో భాగంగా మల్లేశ్వరస్వామి వారికి కూడా పలు విశేష అర్చనలను నిర్వహించారు. బ్రాహ్మణవీధిలో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో కొలువుదీరిన శ్రీ పద్మావతి అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి, దీక్షిత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపేట సైకంవారి వీధిలోని శ్రీ దర్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో పార్వతీదేవి ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. కార్యక్రమాలను ఆయా ఆలయాల కార్యనిర్వహణాధికారులు పర్యవేక్షించారు.



రజితకవచాలంకృతగా చదునుమహాలక్ష్మి అమ్మవారు



మహాలక్ష్మిగా పద్మావతి అమ్మవారు



రజితకవచాలంకృత భ్రమరాంబదేవిగా భ్రమరాంబ అమ్మవారు



బాలాత్రిపుసుందరీదేవిగా గంగానమ్మ అమ్మవారు



భవానీపురం కోళ్ల ఫారం రోడ్డులో అమ్మవారు

డ్రోన్లతో పారిశుద్ధ్య పర్యవేక్షణ



పటమట(విజయవాడతూర్పు): దసరా ఉత్సవాల్లో పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా డ్రోన్ల సహాయంతో పర్యవేక్షణ చర్యలు చేపట్టాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. కమిషనర్ గురువారం సీతమ్మ వారి పాదాలు, వినాయకుడిగుడి, రథం సెంటర్, అమ్మవారి గుడి పైన జరుగుతున్న ఏర్పాట్లను, పారిశుద్ధ్య నిర్వాహణ విధానాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ అధికారులంతా వారికి కేటాయించిన ప్రదేశాల్లో నిరంతర పర్యవేక్షిస్తుండాలన్నారు. ఎక్కడైనా వ్యర్థాలు నిల్వ ఉన్నట్లు డ్రోన్ల సాయంతో గుర్తించి, ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేస్తే పారిశుద్ధ్య తలెత్తకుండా చూడవచ్చన్నారు. ఈమేరకు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ, భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. వీఎంసీ ఏర్పాటుచేసిన ఉచిత తాత్కాలిక మరుగుదొడ్లు, క్లాక్ రూమ్స్, చెప్పుల స్టాండు, తాగునీరు ఏర్పాట్లను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. భవానీ ఘాట్, పున్నమి స్నానాల ఘాటు దగ్గర పారిశుద్ధ్య నిర్వహణలో లోపం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధునికి గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో వృద్ధుడు గాయపడిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భానూనగర్‌కు చెందిన పేకేటి సత్యనారాయణ తండ్రి తాతారావు(75) బుధవారం రాత్రి బీఆర్టీఎస్ రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన తాతారావును ఆస్పత్రికి తరలించారు. సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మున్సిపల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మున్సిపల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు సంఘ తూర్పు నియోజకవర్గ అధ్యక్షులు డి.అశోక్‌కుమార్, ఫైనాన్స్ కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు గురువారం స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

స్వచ్ఛంద సేవా సంస్థల సేవలు అభినందనీయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): వరద బాధితులకు స్వచ్ఛంద సేవా సంస్థలు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ(సుజనా) చౌదరి పేర్కొన్నారు. గొల్లపూడి పంచాయతీ పరిధిలోని హెచ్‌ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం సాయంత్రం ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ లిమిటెడ్ సహకారంతో రౌండ్ టేబుల్ ఇండియా ట్రస్ట్ (ఆర్‌టీఐటీ) ఆధ్వర్యాన ముంపు బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ.. రూ.60 లక్షలతో నాలుగు వేల మంది ముంపు బాధితులకు నిత్యావసరాల కిట్లను అందజేయటం ఆయా సంస్థల మంచి మనసుకు నిదర్శనమన్నారు. నేటి యువత సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. టీడీపీ సీనియర్ నాయకులు బొమ్మసాని సుబ్బారావు నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో రౌండ్ టేబుల్ ఇండియా ఏరియా చైర్మన్ మక్సూద్ అహ్మద్, వైస్ చైర్మన్ యక్కల కౌశిక్, శ్రీకర్, ఎన్.ఆదిత్య, ఎం.సేథీ, అశ్విన్, సమీక్ష సేథీ, వినీల, అమూల్య, కె.మోహన్, సంపత్ కుమార్, అద్దూరి శ్రీరామ్, ఎ.రాంబాబు పాల్గొన్నారు.



బాధితులకు కిట్లు అందజేస్తున్న సుజనా చౌదరి

విద్యార్థుల కుటుంబాలకు కిట్ల పంపిణీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ముంపునకు గురై నిరాశ్రయులైన కుటుంబాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సర్వింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్(ఎస్హేట), సుదర్శన్ ఫౌండేషన్ సంయుక్తంగా నిత్యావసరాలతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాల్లో చదువుతున్న విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1000ల విలువైన కిట్లను గురువారం అందజేశారు. అదే విధంగా మానసిక దివ్యాంగ విద్యార్థులకు చెందిన 15 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1500లు విలువైన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్వింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గద్దం చంద్రశేఖర్, సుదర్శన్ ఫౌండేషన్ చైర్మన్ బాణాల జగదీష్ మాట్లాడుతూ.. వరద ప్రభావంతో పేద కుటుంబాలు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాతలు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు యూసఫ్, ఉపాధ్యాయులు కె.నెహ్రూ, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొని దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.



దాతల సాయం అందుకున్న విద్యార్థుల కుటుంబాలు